సాక్షి
వికారాబాద్
గురువారం । 3 । జూలై । 2025



ఫార్మర్ రిజిస్ట్రీ అంతంతే!
వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. 8లో▸



బడుల్లో గ్రంథాలయాలు
విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 8లో▸



వెతలు తీరవా?
గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఉల్లి రైతుకు సబ్సిడీ

బంట్వారం: వానాకాలంలో ఉల్లి పంట సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ తరఫున ఎంఐడీహెచ్ వారు ఎకరాకు రూ.8 వేల చొప్పున సబ్సిడీ అందజేస్తారని కోట్‌పల్లి వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉల్లి పంట వేసిన రైతులు స్థానిక ఏఈఓల దగ్గర పంట వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఐదు ఎకరాల వరకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో పాటు ఉల్లి విత్తనాలు కొనుగోలు చేసిన రసీదు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను ఏఈఓలకు అందజేయాలన్నారు. వానాకాలంలో ఉల్లి సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కంది విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న రాంరెడ్డి

కొడంగల్: మండలంలోని అంగడి రాయిచూర్ గ్రామంలో 150 మంది రైతులకు బుధవారం ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. అధిక దిగుబడినిచ్చే మేలు రకం కంది విత్తనాలను అందజేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు గోడల రాంరెడ్డి అన్నారు. రైతులను ఆర్థికంగా ఆదుకోడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పావని తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి లలితాదేవి

పరిగి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ లలిత బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తాము ముందుంటామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బీఎంఆర్‌ను కలిసిన లలితాదేవి

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని జిల్లా వైద్యాధికారి లలితాదేవి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చూడాలని, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

ఏబీవీపీ నాయకుల డిమాండ్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

తాండూరు టౌన్: అధిక ఫీజు వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలంటూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా తాండూరు పట్టణంలోని కొన్ని ప్రైవేటు స్కూళ్లు అధిక ఫీజు వసూళ్లకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పుస్తకాలు, నోట్ బుక్స్ వారి వద్దే కొనుగోలు చేయాలని షరతు విధిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో సామాన్య ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు నర్సింలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజయ్, నాయకులు నవీన్, శ్రీకాంత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నడక.. నరకం

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- చిన్నపాటి వర్షానికే బురదమయం
- మట్టి పోసి మమ అనిపిస్తున్న అధికారులు
- విద్యుత్ కోతలతో అవస్థలు
- వర్షం పడితే గంటల తరబడి బంద్
- ఇబ్బందుల్లో ప్రజలు

సాక్షి ఫోకస్

ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రోడ్లే ముఖ్యం. రోడ్లు ఉంటే రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది.. తద్వారా రాకపోకలు పెరిగి ప్రజలు వ్యాపార పరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.. అయితే ఏళ్ల క్రితం మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలు, కొత్తగా వెలసిన కాలనీలకు రోడ్లు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు. వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాయి. మున్సిపాలిటీల్లో అంతర్గత రహదారులు, విద్యుత్ సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు

రహ'దారి' కష్టాలు

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. మున్సిపాలిటీలో విలీనమైన నాటి నుంచి పూర్తి స్థాయిలో రోడ్ల పనులు చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. ఐనన్‌పల్లి, బూల్కాపూర్, కొండారెడ్డిపల్లి గ్రామాలకు రోడ్డు వేయాల్సి ఉంది. ప్రస్తుతం మట్టి రోడ్లే ఉన్నాయి. పాత కొడంగల్ వెళ్లాలంటే చెరువు కట్టపై ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కొత్తగా రోడ్లు వేయడానికి నిధులు మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల్లో సుమారు రెండు వేలకు పైగా జనాభా ఉంది. 1,200మందికి పైగా ఓటర్లు ఉన్నారు. ఈ రెండు గ్రామాలకు వెళ్లాలంటే మట్టి రోడ్లే దిక్కు. ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఐనన్‌పల్లి గ్రామంలో మురుగు కాల్వలు నిర్మించాల్సి ఉంది.



పాత కొడంగల్‌లో బురదమయంగా అంతర్గత రోడ్డు (ఇన్‌సెట్‌లో) బూల్కాపూర్ రోడ్డుపై మురుగు నీరు నిలవడంతో నడిచేందుకు ఇబ్బంది పడుతున్న జనం

వికారాబాద్: మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్లు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా అన్నింటిలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో వేసిన లేఅవుట్లు, వెంచర్లలో కూడా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. రోడ్లపై మట్టిపోసి మమ అనిపించారు. అధికారులు సైతం మామూళ్లకు అలవాటు పడి కనీస సౌకర్యాలు ఉన్నాయా..? లేదా..? అని కూడా చూడటం లేదు. మెజార్టీ కాలనీల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. కాస్త వర్షం కురిసినా దారులు పూర్తిగా చిత్తడిగా మారుతున్నాయి. కొన్ని కాలనీల్లోకి ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. నడుచుకుంటూ వెళ్లాలన్నా భయం వేస్తోందని పలువురు పేర్కొన్నారు. జిల్లా కేంద్రం



వికారాబాద్ రైల్వే బ్రిడ్జిపై వెలగని విద్యుత్ దీపాలు

వికారాబాద్‌లో 80వేల జనాభా ఉండగా ఆయా గ్రామాల నుంచి రోజూ 20వేల నుంచి 30వేల మంది ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. ప్రస్తుతం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 35 కిలోమీటర్ల పొడవున సీసీ రోడ్లు ఉండగా మరో 60 కిలోమీటర్లకు పైగా సీసీ అవసరం ఉంది.

కరెంటు కోతలతో సతమతం

రోజురోజుకూ కరెంటు కోతలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఆరు నెలలుగా ఈ సమస్య మరింత పెరిగింది. విద్యుత్ వ్యవస్థలో ఉన్న చిన్నచిన్న సమస్యల కారణంగా కోతలు విధించాల్సి వస్తోంది. వర్షం పడినంతసేపు కరెంటు కట్ చేస్తున్నారు. రాత్రి సమయంలో కోతల కారణంగా ప్రజలు నిద్రపోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. కాలం చెల్లిన ఐరన్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. పలు చోట్ల విద్యుత్ తీగలు చెట్లకు తాకుతుండటం, గాలి తీవ్రతకు తీగలు తెగి పడటం లాంటివి చోటు చేసుకుంటున్నాయి. కలెక్టరేట్‌కు వెళ్లే దారి వీధి దీపాలు లేవు. దీంతో అంధకారం నెలకొంది.

కాలనీలు బురదమయం

పరిగి: పరిగి మేజర్ మున్సిపాలిటీ అయినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. కాలనీలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీలో చాలా కాలనీలకు రోడ్లు లేవు. పట్టణ పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ పనులు ప్రారంభం కాలేదు. చిన్నపాటి వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ప్రజలు నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో బురదయంగా మారిన రోడ్లపై వరినాట్లు వేసి ప్రజలు నిరసన తెలిపిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినా ఎవరూ స్పందించిన పాపాన పోలేదు. వెంకటేశ్వర కాలనీలో ఏ ఒక్క వీధికి కూడా రోడ్డు సౌకర్యం లేదు. విద్యానగర్ కాలనీ, పాత పరిగి ఇతర కాలనీల్లో సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా చోట్ల వీధి దీపాలు లేక అంధకారం నెలకొంటోంది. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



గుంతలమయంగా మారిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి



తాండూరులో అంతర్గత రోడ్డు దుస్థితి

దెబ్బతిన్న రోడ్లు.. జనం పాట్లు

తాండూరు: మున్సిపల్ పరిధిలోని అంతర్గత రోడ్లు దారుణంగా తయారయ్యాయి. ఆరేళ్ల క్రితం పలు గ్రామాలను తాండూరు మున్సిపాలిటీలో విలీనం చేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు. ఏడేళ్ల క్రితం రూ.33 కోట్లతో పలు రోడ్లను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అవన్నీ పూర్తిగా పాడయ్యాయి. మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉండగా 6, 7 వార్డుల్లో మినహా మిగతా వాటిలో పెద్దగా అభివృద్ధి పనులు జరగలేదు. రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా ఆస్తి పన్ను వసూలు చేసే మున్సిపల్ అధికారులు మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీలతోపాటు పట్టణ శివారు ప్రాంతాలన్నీ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పలు శివాజీ చౌక్ నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు వీధి దీపాలు వెలగటం లేదు.

వన మహోత్సవాన్ని సక్సెస్ చేద్దాం

డీఆర్‌డీఏ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ శ్రీనివాస్

తాండూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీఏ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పెద్దేముల్, తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాల శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. విరివిగా మొక్కలు నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. తాండూరు పరిసరాల్లో సిమెంట్ పరిశ్రమలు, నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్లు ఎక్కువగా ఉండటంతో కాలుష్యం వెదజల్లుతోందని, ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే మొక్కల పెంపకమే మార్గమన్నారు. ఆయా మండలాలను కేటాయించిన మొక్కల లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఏపీఓలు నరోత్తం రెడ్డి, నర్సింలు, జనార్దన్, శారద, ఈసీలు మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, శ్రవణ్, నర్సిరెడ్డి ఉన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మాస్టర్ ట్రైనర్స్
- నేటి నుంచి శిక్షణ తరగతులు



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

కొడంగల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం మాస్టర్ ట్రైనర్స్ సూచించారు. బుధవారం కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఏఈఆర్ఓలు, ఏఎల్ఎంటీ, బీఎల్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల ప్రధాన అధికారి ప్రతి రోజూ పర్యవేక్షణ ఉంటుందన్నారు. పాదర్శకంగా జవాబుదారీగా ఉండాలన్నారు. ఎన్నికల సిబ్బందికి నేటి నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. కొడంగల్ మండల సిబ్బందికి స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాల సిబ్బందికి ఈ నెల 8న బొంరాస్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో, దౌల్తాబాద్ మండల సిబ్బందికి 10వ తేదీ దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. వీరికి అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ రవికుమార్, అబ్దుల్ హాఖ్, క్రాంతి, సాయిలు, భీమయ్య, బుడ్డయ్య శిక్షణ ఇస్తారు.

పోరాటాలతోనే లంబాడాలకు న్యాయం



కేక్ కట్ చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్

పరిగి: హక్కుల సాధన కోసం ఎల్‌హెచ్‌పీఎస్ పోరాటం చేయడం ద్వారానే లంబాడాలకు న్యాయం జరిగిందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ తెలిపారు. బుధవారం పరిగి పట్టణంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంబాడా హక్కుల పోరాట సమితి కృషితోనే తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయన్నారు. మా తండాల్లో.. మా రాజ్యం కావాలని వీరన్న నాయకత్వంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావం జరిగిందన్నారు. 10శాతం రిజర్వేషన్లు కూడా సాధించుకున్నామని పేర్కొన్నారు. లంబాడాలకు ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడికి వెళ్లి వారికి అండగా నిలిచామని చెప్పారు. లంబాడీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్, కార్యదర్శి రవీందర్, నాయకులు బాలకృష్ణ, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: ఇటీవల జిల్లాకు చెందిన ముగ్గురు హోంగార్డులు మృతి చెందడంతో బాధిత కుటుంబాలకు బుధవారం ఎస్పీ నారాయణరెడ్డి ఆర్థిక సాయం చేశారు. హోంగార్డుల సంఘం సమకూర్చిన నగదును వారికి ఇచ్చారు. ఏఆర్ డీఎస్పీ వీరేశం, ఆర్ఐ డేవిడ్, హోంగార్డుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు నర్సింలు, దశరథ్, బందయ్య, కృష్ణ పాల్గొన్నారు.

అధ్యక్ష పదవికి పోటాపోటీ

- బరిలో పది మంది ఆశావహులు
- ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో నేతలు

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ బషీరాబాద్ మండల అధ్యక్ష పదవికి నేతల మధ్య తీవ్ర పోటీ ఉంది. మండల కేంద్రం నుంచి తొమ్మిది మంది పాత నేతలు, కొత్తగా వచ్చిన మరో వ్యక్తి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత మండల అధ్యక్షుడు కలాల్ నర్సింలు, సీనియర్ నాయకులు రామునాయక్, వడ్డే ఉల్లప్ప, శంకర్‌నాయక్, రాజవర్ధన్‌రెడ్డి, మాణిక్‌రావు, నరేష్ చౌహన్, సిద్దార్థ్, వాల్మికి నరేష్, కంసాన్‌పల్లి వెంకట్‌రెడ్డి రేసులో ఉన్నారు. రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవీ కోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేష్ మహరాజ్ దరఖాస్తు చేశారు. వీరితో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ వంటి అనుబంధ సంఘాల మండల అధ్యక్ష పదవుల కోసం మరో 30 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. అయితే 2017 కంటే ముందు నుంచి పార్టీలో ఉన్న వారికే అధ్యక్ష పదవి వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా యువతకే అవకాశం ఇవ్వాలని యువజన కాంగ్రెస్ నాయకుడు మాణిక్‌రావు డిమాండ్ చేస్తున్నారు. తాను కూడా పదవి ఆశిస్తున్నట్లు తెలిపారు. ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్ సూచన మేరకు ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం

- తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆఫీసర్ నవీన్‌కుమార్ బసురి
- పలు శాఖల అధికారులతో సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న నవీన్ కుమార్

అనంతగిరి: చిన్నస్థాయి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆఫీసర్ నవీన్ కుమార్ బసురి తెలిపారు. వికారాబాద్ కలెక్టరేట్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో మంగళవారం జనరల్ మేనేజర్ మహేశ్వర్ అధ్యక్షతన ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్‌పై వ్యవసాయ, హార్టికల్చర్, మత్స్య, పశుసంవర్ధక తదితర శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, రైతుల ఆదాయ వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ వృద్ధి తదితర అంశాలపై ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం, సాంకేతిక మద్దతు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, లేబులింగ్, మార్కెటింగ్ లింకేజెస్, రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. పథకంలో భాగంగా వ్యక్తిగత యూనిట్లకు 35శాతం రాయితీ, గరిష్టంగా 10 లక్షల వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సమూహ ప్రాజెక్టులకు (ఎఫ్పీఓలు, స్వయం సహాయక సంఘాలు, ప్రొడ్యూసర్ గ్రూపులకు) గరిష్టంగా రూ.3 కోట్ల వరకు రాయితీ పొందవచ్చని వివరించారు.
వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక, మత్స్య ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువవృద్ధి, బ్రాండింగ్, మార్కెటింగ్, రుణ మద్దతు తదితర అంశాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఈ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా పరిశ్రమల కేంద్రం సెల్ నంబర్ 8121009155లో సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుస్తకాల దందాను సహించేది లేదు



కార్పొరేట్ స్కూల్‌లోని పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటయ్య గౌడ్

తాండూరు టౌన్: ప్రైవేటు స్కూళ్లలో పాఠ్య పుస్తకాల దందాను సహించేది లేదని ఎంఈఓ వెంకటయ్యగౌడ్ హెచ్చరించారు. పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాలు, నోటుబుక్కులతో పాటు స్టేషనరీ సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు అందుకున్న ఆయన బుధవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన పుస్తకాల గదిని సీజ్ చేశారు. ప్రైవేటు స్కూళ్ల దోపిడీని అరికట్టాలని బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లిలో బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన గొల్ల మల్లప్పకు చెందిన గేదె గడ్డి మేత మేస్తూ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడింది. రూ.1.50 లక్షలు నష్టపోయానని బాధితుడు వాపోయాడు.

స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు



నాగిరెడ్డిగూడ వద్ద రోడ్డు కింద పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

మొయినాబాద్: డ్రైవర్ నిర్లక్ష్యంతో స్కూల్ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన నాగిరెడ్డిగూడలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్ బస్సు బాకారం నుంచి పిల్లలను ఎక్కించుకుని నాగిరెడ్డిగూడ వెళ్తుండగా గ్రామ సమీపంలో రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఒకవైపు చక్రాలు పంటపొలంలోకి దూసుకెళ్లడంతో బస్సు ఆగిపోయింది. ఈ సమయంలో బస్సులో సుమారు 15 మంది విద్యార్థులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడంతోనే రోడ్డు కిందికి దూసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు మండిపడ్డారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. స్కూల్ బస్సులు వరుస ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో వీటి ఫిట్‌నెస్‌పై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాడెద్దుల అపహరణ

నందిగామ: రోజంతా అరక కొట్టి రాత్రివేళ చెట్టుకింద కట్టేసిన కాడెద్దులు అపహరణకు గురైన సంఘటన నందిగామలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ ప్రసాద్ కథనం ప్రకారం.. స్థానికంగా ఉండే శివగళ్ల జంగయ్యకు గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన వ్యవసాయ భూమి ఉంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలంలో తన ఎద్దులతో అరక తోలాడు. రాత్రి ఎప్పటిలాగే పొలం వద్ద ఓ చెట్టుకు ఎద్దులను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి అవి కనపడలేదు. దీంతో తెలిసిన వారి వద్ద, పరిసర గ్రామాలలో ఎంత వెతికినా జాడ కనపడలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. ఎద్దుల విలువ సుమారు రూ.లక్ష యాభై వేలు ఉంటుందని వాపోయాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబికేర్ కై M/F వర్కర్స్ కా॥ బో+వసతి + జీతం: 16-18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్ : 9281465319, 9010680011
[SCA25005822]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఫార్మర్ రిజిస్ట్రీ అంతంతే!



కొడంగల్‌రూరల్: పర్సాపూర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీలో వ్యవసాయాధికారులు



దోమ: బట్లచందారంలో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న అధికారులు

వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఓ పక్క సర్వర్ మొరాయింపు, ఇంకోపక్క వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం, మరోవైపు అవగాహన లేమి.. వెరసి పంటల ఆన్‌లైన్ నమోదుకు అడ్డంకిగా మారాయి.

- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- నమోదు ప్రక్రియకు ముందుకు రాని కర్షకులు
- తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారుల సూచన

కొడంగల్ రూరల్: గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ నామమాత్రంగానే కొనసాగుతోంది. వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండడంతో నమోదు చేసుకోవడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఫార్మర్ రిజిస్ట్రీ ఉద్దేశం నీరుగారుతోంది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతువేదిక, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ ఫార్మర్ రిజిస్ట్రీ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో 17,449 మంది కర్షకులు ఉండగా కేవలం 5,825 మంది మాత్రమే(33శాతం) రిజిస్ట్రీ చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు.

మే 5 నుంచే ప్రారంభం

వ్యవసాయరంగంలో రైతుల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేయడానికి, వారి భూమి యాజమాన్యం, పథకాల లభ్యత అనుసంధానం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో నమోదు చేసుకున్న రైతులకు ఆధార్‌కార్డు మాదిరి 11 అంకెలతో కూడిన ఐడీని అందిస్తారు. ఈ ప్రక్రియను మే నెల 5వ తేదీ నుంచి వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. అప్పటి నుంచి రైతులు ధాన్యం అమ్మకాలు, కొనుగోలు కేంద్రాలకు వెళ్లడం వంటి పనులు మాత్రమే ఉండడంతో చక చకా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నారు. అనంతర పరిణామాలలో వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు రిజిస్ట్రీ ప్రక్రియకు ఆసక్తి చూపడం లేదు.

పథకాలకు ఐడీ కచ్చితం

ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులకు అందించే ఐడీ కీలకంగా మారనుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ ఐడీతోనే రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన రైతుల పథకాలు దక్కనున్నాయని అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టనున్న పంటల నమోదు కార్యక్రమంలో ఈ ఐడీని ఉపయోగించనున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు గ్రామాల్లోని రైతు వేదికలు, గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని సూచిస్తున్నారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను మొబైల్ నంబర్‌ను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని పేర్కొంటున్నారు.

సాంకేతిక సమస్యలతో ఇబ్బంది

దోమ: మండలంలో 28 శాతమే ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు పూర్తయిందని అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం 36 గ్రామ పంచాయతీలలో 16,606 మంది రైతులకు ఉండగా, ఐదు వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. క్లస్టర్‌కు ఓ వ్యవసాయ విస్తరణ అధికారి విధులు నిర్వహించగా, ఆయా గ్రామాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. చాలా చోట్ల సర్వర్లు మొరాయిస్తున్నాయని అధికారులు, రైతులు వాపోతున్నారు. రైతు భరోసా, పంటల నమోదు, విత్తనాలు, ఎరువుల సరఫరా తదితర విషయాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే బిజీ ఉండగా, కేంద్ర ప్రభుత్వం అదనంగా మరో ఫార్మర్ రిజిస్ట్రీని తీసుకురావడంతో ఏఈఓలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దీనికి తోడు సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు అధికమవుతున్నాయి.

ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీతో ముఖ్యంగా పీఎం కిసాన్ నిధి, ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన వంటి పథకాల అమలులో ఐడీ తప్పనిసరిగా అవసరమవుతుందని నొక్కి చెబుతున్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నమోదుతో మేలు

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ కొనసాగుతోంది. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు బిజీగా మారారు. వారు వీలు చూసుకొని వ్యవసాయ విస్తరణ అధికారులకు పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌తో ఫార్మర్ రిజిస్ట్రీ తప్పకుండా చేసుకోవాలి.

– తులసీ, ఏఓ కొడంగల్

ఇబ్బందులు పడుతున్నాం

ప్రతి గ్రామంలో నెట్‌వర్క్, ఓటీపీ లాంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక్కొక్క రైతుకు ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింకు లేకపోవడంతో రిజిస్ట్రీ నిలిచిపోతుంది. ప్రతి రైతు వద్ద 30 నిమిషాలు పడుతుంది. ఇతర పనులను చేయలేని పరిస్థితిలో ఉన్నాం.

– చెన్నయ్య, ఏఈఓ, దాదాపూర్, దోమ

ప్రక్రియ కొనసాగిస్తున్నాం

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను మండలంలో కొనసాగిస్తున్నాం. నెల రోజుల నుంచి ఏఈఓలు క్షేత్రస్థాయిలో వెళ్లి రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు 28 శాతం పూర్తయింది. త్వరలో వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్‌రావు, ఏఓ, దోమ

బడుల్లో గ్రంథాలయాలు

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం
- ఒక్కో పాఠశాలకు 117 పుస్తకాలు

దౌల్తాబాద్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం గ్రంథాలయంలో పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 41 పాఠశాలలున్నాయి. ఇందులో నుంచి 12 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎంపిక చేశారు. వాటికి ప్రభుత్వం గ్రంథాలయ పుస్తకాలను అందజేసింది.

రెండు భాషల్లో..

నేషనల్ బుక్స్ ట్రస్ట్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజి ఆధ్వర్యంలో గ్రంథాలయ పుస్తకాలను రూపొందించారు. నీతి కథలతో విద్యార్థుల్లో మేధా సంపత్తి పెంపొందించేలా పుస్తకాలను తీర్చిదిద్దారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో అందమైన బొమ్మలతో పిల్లలను ఆకట్టుకునేలా పాఠ్యాంశాలు ఉన్నాయి. అభ్యసన సామర్థ్యాలతో పాటు విద్యా ప్రగతికి దోహదం చేసేలా ఉన్నాయి. చదువు విలువ తెలిసేలా అందులో పాఠ్యాంశాలను పొందుపర్చారు. ఒక్కో పాఠశాలకు 117 రకాల పుస్తకాలు సమకూర్చుతున్నారు. పాఠశాలల్లో ప్రత్యేక గదిని కేటాయించి గ్రంథాలయంగా మార్చి విద్యార్థులు నిత్యం పుస్తకాలు చదివేలా ఒక పీరియడ్‌ను సైతం విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు.



కథల పుస్తకాలు

రోజూ చదివించాలి

విద్యార్థులతో గ్రంథాలయ పుస్తకాలను ప్రతి రోజు చదివించాలి. అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించాలి. విద్యా సంవత్సరం ముగిసే వరకు పుస్తకాలను భద్రంగా ఉంచాలి. ఆకట్టుకున్న పుస్తకాలపై విద్యార్థులు దృష్టి సారించేలా చూడాలి.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

తెల్లచందనం స్మగ్లర్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిషన్, ఇతరులు

- అక్రమంగా తరలిస్తున్న వెయ్యి కిలోల శ్రీగంధం చెక్కలు స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు, పరారీలో ఇద్దరు
- పట్టుబడిన సరుకు విలువ రూ.35 లక్షలు

చేవెళ్ల: పుష్ప సినిమా తరహాలో.. అక్రమంగా తరలిస్తున్న టన్ను (1,000 కిలోల) తెల్లచందనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ వెల్లడించారు. మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు చేవెళ్ల పోలీసులతో కలిసి మంగళవారం మండలంలోని బస్తేపూర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎంహెచ్ 25 ఏజీ 3689 నంబరు కలిగిన డీసీఎం వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్ బాడీ మొత్తం ఖాళీగా ఉండగా.. డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను ఎక్కడి నుంచి వస్తున్నారని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు డ్రైవర్ వెనక భాగంలో ప్రత్యేకంగా ఓ చిన్నపాటి అరను తయారు చేయించినట్లు గమనించారు. దీన్ని తెరిపించి చూడగా ప్లాస్టిక్ బ్యాగులలో చిన్నచిన్న ముక్కలుగా ఉన్న తెల్లచందనం(శ్రీగంధం) చెక్కలను గుర్తించారు. ఫారెస్ట్ అధికారులను పిలిపించి నిర్ధారించుకున్న అనంతరం ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వెయ్యి కిలోల బరువున్న గంధం చెక్కల విలువ రూ.35 లక్షలు ఉంటుందని ఏసీపీ తెలిపారు. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా జాత్ తహసీల్ ఉంట్వాడీ గ్రామం నుంచి చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలం నాగరగూడలోని ఆంధ్ర పర్ఫ్యూమ్ ఫ్యాక్టరీకి వీటిని తరలిస్తున్నారు. పట్టుబడిన ముగ్గురిలో తెల్లచందనం సాగు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన విజయ్ హన్మంత్ మానే, డీసీఎం డ్రైవర్ అబ్దుల్ అజీజ్, ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ సోహెబ్ ఉన్నారు. అనుమతులు లేకుండా తెల్లచందనం కొనుగోలు చేసి, తీసుకువస్తున్న ఫ్యాక్టరీ యజమాని అబ్దుల్లా కున్హి, కంపెనీ మేనేజర్ సాదిక్‌పై కూడా కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరు పరారీలో ఉన్నారు. సదరు ఐదుగురు వ్యక్తులపై అటవీ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు గతంలో ఒకే పర్ఫ్యూమ్ కంపెనీలో పనిచేశారని పోలీసులు వెల్లడించారు. డీసీఎంతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్, మాదాపూర్ ఎస్‌ఓటీ సీఐ సంజయ్ కుమార్, ఫారెస్ట్ అధికారి రవికుమార్, ఎస్‌ఐలు వనం శిరీష, ఎస్‌ఓటీ ఎస్‌ఐలు సతీష్, బారాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కారడవిలో ఉరేసుకున్న వ్యక్తి

ఆర్థిక ఇబ్బందులే కారణమని కుటుంబీకుల ఫిర్యాదు



రమేశ్ (ఫైల్)

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరిగుట్ట అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం స్థానికంగా కలకలం రేపింది. సీఐ భీంకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామానికి చెందిన సంగనమోని నరసింహ పెద్ద కుమారుడైన రమేశ్(27) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కాగా గత నెల 29న రాత్రి పని నిమిత్తం ఇంటి నుంచి బయటికి వెళ్లిన రమేశ్ ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో సాధ్యమైన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం గుడిమల్కాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు ఇవ్వగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రమేశ్ ఫోన్ లొకేషన్ అనంతగిరిగుట్ట ప్రాంతంలో చూపించింది. దీంతో తెల్లవారు జామునుంచి వెతుకుతుండగా అతని స్కూటీ వ్యూ పాయింట్ దగ్గర పార్క్ చేసి ఉండటంతో పరిసరాల్లో వెతికారు. ఈ క్రమంలో ఓ చెట్టుకు ఉరేసుకున్న ఆయన మృతదేహం లభ్యమయింది. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, ఓ పాప ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దచెరువులో మట్టి తవ్వకాలు!

మీర్‌పేట: పెద్దచెరువు (ఐల్యాండ్)లో నిబంధనలకు విరుద్ధంగా బుధవారం ఉదయం మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులను వివరణ కోరగా.. మాకేం సంబంధం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చెరువు కట్టపై మొక్కలు నాటేందుకు.. కొద్దిగా మట్టి తీసుకెళ్తున్నామని అక్కడే ఉన్న కాంట్రాక్టర్ తెలిపారు. వాస్తవానికి బయటనుంచి మట్టి తీసుకురావాల్సి ఉన్నా.. చెరువు స్థలంలో తవ్వకాలు చేపట్టడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇలా తవ్విన గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చెరువు స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి జేసీబీ, ట్రాక్టర్లతో లోనికి వెళ్లారని ఆరోపించారు.



పెద్ద చెరువు (ఐల్యాండ్)లో అక్రమంగా మట్టిని తవ్వుతున్న దృశ్యం

నగదు రహిత ఆరోగ్య కార్డులివ్వాలి

తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి

ధారూరు: నగదు రహిత ఆరోగ్య కార్డులను ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు కె.అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో పీఆర్‌సీ, డీఏను వర్తింప జేయాలని కోరారు. సంఘంలో పెద్ద ఎత్తున సభ్యత్వాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమాల్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.రాజు, బాల్‌రాజ్‌లు, కోశాధికారి విజయ్, జిల్లా బాధ్యులు రాజ్‌కుమార్, సంతోష్, సభ్యులు సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధారూరులో ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న సంఘం నేతలు

హనుమాన్ విగ్రహ ధ్వంసం



ధ్వంసమైన విగ్రహం

- వికారాబాద్‌లో హిందూ సంఘాల ఆందోళన
- దుండగులను పట్టుకోవాలని బీజేపీ నేతల డిమాండ్

అనంతగిరి: హనుమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని సుభాష్‌నగర్ ఐటీఐ శిక్షణ కేంద్రంలో ఉన్న హనుమాన్ దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు స్వామివారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. బుధవారం ఉదయాన్నే ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, హిందూ సంఘాల నాయకులు ఆలయం వద్దకు చేరుకుని విగ్రహాన్ని పరిశీలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రోడ్డుపై నిరసన వ్యక్తంచేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి, దుండగులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుల్లపల్లి రమేష్‌కుమార్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, మాజీ కౌన్సిలర్లు లక్ష్మణ్, శ్రీదేవి, పోకల సతీష్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు చరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, ఎక్మాయివాసులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

బషీరాబాద్: మండలంలోని ఎక్మాయి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. బుధవారం బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి సీపీఎం పార్టీ నాయకులు ధర్నాకు దిగారు. గ్రామంలోని అధికార పార్టీకి చెందిన నలుగురు నాయకులు డబ్బులు తీసుకొని ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎక్మాయిలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో 70 శాతం అనర్హులకు ఇళ్లు కేటాయించారన్నారు. ముఖ్యంగా ఎస్సీ, బీసీ, మైనార్టీ, పేదలకు ఇళ్లు ఇవ్వకుండా ఉన్నత వర్గాలకు చెందిన వారికి, కాంగ్రెస్ నాయకుల కుటుంబ సభ్యులకు ఇచ్చారని మండిపడ్డారు. లబ్ధిదారుల దగ్గర డబ్బులు వసూలు చేసిన నాయకులపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బాధితులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో ఇళ్ల అక్రమాలపై సాక్షి దినపత్రికలో జూన్ 27న ప్రచురితమైన 'ఇందిరమ్మ'లో ఇంటి దొంగలు కథనం క్లిప్పింగ్‌ను ప్రదర్శించారు. అనంతరం తహసీల్దార్ షాహేద బేగంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, సీపీఎం మండల నాయకులు సురేష్, వెంకటేశ్, గ్రామస్తులు గజలప్ప, శ్యామప్ప, అమృతమ్మ, లక్ష్మి, మంజుల, రేణుక, జె.లక్ష్మి, నర్సిములు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగు లేదు



బీమా బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

- సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్
- తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్ల అందజేత

అనంతగిరి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో ప్రవేశపెట్టిందని, సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లోని ఓంసాయి ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి ఈ సిమెంట్ సరైన ఎంపిక అని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని, స్లాబ్, కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడుతారని స్పష్టంచేశారు. మార్కెట్లో దొరికే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ ధర బ్యాగుకు 20 రూపాయలు అధికంగా ఉంటుందన్నారు. అనంతరం 60 మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరాంజనేయరెడ్డి, డీలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీంద్రాచారి

హయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వ కర్షక, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ సర్కారు తీరుకు నిరసనగా ఈ నెల 9న తలపెట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఫిక్స్‌డ్ టర్మ్, అప్రెంటీస్, థర్డ్ పార్టీ ట్రెనీలుగా పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు హరిసింగ్‌నాయక్, నాయకులు లక్ష్మణ్, నర్సింహ, ప్రసాద్, నవనీత తదితరులు పాల్గొన్నారు.